
# మధూదయంలో మంచిముహూర్తం



నాటెన్త్ పరీక్షలవగానే అందరం హైదరాబాదు నుంచి రాజమండ్రి చేరాం. ఆ వూళ్ళో మా నాన్నకి ఐ.ఎల్.టి.డి. రిసెర్చి లేబరేటరీ కట్టే పని అప్పగించారన్నమాట. నేనక్కడ మన రాష్ట్రంలోనే మొట్టమొదటి కాలేజిల్లో ఒకటైన గవర్నమెంట్ ఆర్ట్స్

కాలేజిలో పి.యు.సి., రెండు సంవత్సరాలు బిఎస్సీ చదివాను. ఆ కాలేజికి నేను చదువుతున్నపుడే సెంటినరీ సెలబ్రేషన్సు అయ్యాయి. అది నా అదృష్టం. మా తాతగార్లు, పెదనాన్నలు, బాబాయ్‌లతో మా ఇల్లు ఆ మూడు రోజులూ పెళ్ళివారిల్లులా అయిపోయింది. ఎందుకంటే వాళ్ళందరూ కూడా మా కాలేజి పూర్వ విద్యార్థులే. అప్పుడు ఉపరాష్ట్రపతిగా పని చేస్తున్న డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ముఖ్య అతిథిగా వచ్చారు. ఆయన మా కాలేజిలో కొన్నాళ్ళు లెక్చరరుగా పని చేశారుట.

కాలేజీకి దగ్గర్లో మేము దానవాయిపేటలో ఒక పెద్ద పెంకుటింట్లో అద్దెకుండేవాళ్ళం. సుమారు వెయ్యిగజాల స్థలంలో ఒక పక్కగా ఇల్లు, మిగతా అంతా బోలెడు చెట్లు వుండేవి. వెదురు కర్రలతో జాలీగా అల్లిన తడిక గల పొడుగాటి వీధి వసారా, దానినానుకుని విశాలమైన హాలు, దాని వెనక మళ్ళీ భోజనాల వసారా, అటు మూడు, ఇటు రెండు చిన్న గదులు, ప్రతి గదిలోను మంచి చెక్క అలమారాలు. పెరట్లో పెద్ద తులసి కోట. దాని వెనక స్నానాల గదులు. పెంకుటిల్లయినా చాలా సౌకర్యంగా చల్లగా వుండేది.

పెరట్లో పెద్ద బూరుగు, కొబ్బరి, అయిదారు అరిటి చెట్లు ఉండేవి. ఇంకా జీడి మామిడి, నిమ్మ, కరివేపాకు చెట్లు కూడా వుండేవి. బోలెడు కనకాంబరం, మల్లె దుబ్బులూ, మందార చెట్లు వుండేవి. పెద్ద నుయ్యి, దాని చుట్టూ పళ్ళెం ఎంత బావుండేవో. చేదేసి తోడుకుంటే శీతాకాలంలో వెచ్చటి నీళ్ళు, వేసంకాలంలో చల్లటి నీళ్ళూ పలికేవి. సమశీతోష్ణం అంటే అదీ! ఎంత కష్టపడితే ఇపుడు దొరుకుతాయి? మాకు నిమ్మకాయలు గానీ, బూరుగుదూది గానీ, జీడిపప్పులు గానీ, పూజకి పూలుగానీ కొనే పని లేదు. పైగా జీడిపప్పులు తప్ప మిగతావన్నీ మేమే పంచేవాళ్ళం. మా అమ్మ పచ్చి జీడిపప్పులు వంకాయకూర లోనూ, పనసపొట్టు కూరలోనూ బోలెడు వాడేది. ఇప్పుడు టి.విల్లో చూడట్లా అన్నిట్లో బాదంపప్పు, జీడిపప్పు రుబ్బి పడేస్తారు. ఏదైనా వూరికే వస్తే అంతే మరి. బూరుగు కాయలు పగలగానే అమ్మ దూదేకే అబ్బాయిని పిలిపించి మంచి దిళ్ళు కుట్టించేది. అసలు రాజమండ్రిలో నేల మెత్తగా మహా సారవంతంగా వుంటుంది. ఇలా విత్తనం పడేస్తే అలా మొక్కలొచ్చి తెగ కాపు కాస్తాయి. పొరపాటున ఆనప విత్తనం పడిందో మన పని అయిపోయినట్లే. ఇంటిల్లిపాదీ పదహారు ఆనపఫలాల నోము నోచుకోవచ్చు.

బిఎస్సీ రెండో సంవత్సరం పరీక్షలయిపోయాయి. ఇక మళ్ళీ ఏడు ఫైనల్ ఇయర్. ఎటూ బోలెడు కష్టపడి చదవాలి. ఈ రెండ్నెల్లూ ఎక్కడికయినా వెళ్ళి ఎంజాయ్

చేయాలని నా ఆశ. కానీ నేను ఏ ప్లాను వేసినా చిన్నారమ్మగారు పరీక్షించాలి. ఆ తర్వాత మా అమ్మగారికి సమర్పించాలి. ఆవిడేదో పెద్ద గొప్పగా అన్నీ నాన్న ఇష్టప్రకారం జరుగుతున్నట్లు నాన్ననడిగి చెప్తానంటుంది. అంతా వుత్తదే. మేం 'సరే! నువ్వే అడుగు' అని ఆవిడకే పెద్దరికం ఇస్తాం. అప్పుడు అమ్మని గురించి అలా అనుకునేవాళ్ళం గానీ ఇపుడు మాత్రం ఏం మారింది కాలం? నాన్న అంగీకారం అనేది పార్లమెంటులో బిల్లు పాసయ్యాక ప్రెసిడెంటు గారు చేసే సంతకం లాంటిది. చిన్నారీ, నేనూ ఆలోచించి ఆ రెండు నెల్లూ గాయిత్రి పిన్ని ఇంట్లో గడపాలని తీర్మానం చేసుకున్నాం. మా బాబాయ్, పిన్నీ నెల్లూరు దగ్గర సంగం అనే వూళ్ళో వుండేవారు. అక్కడ ఒక ఆనకట్ట వుంది. మా బాబాయ్ ఇంజనీరు. వాళ్ళ బంగళా సరిగ్గా ఆనకట్ట ఎదురుగా వుంటుందిట. పెన్నా నదిలో ఎప్పుడూ నీళ్ళు పారుతూ వుంటాయిట. చాలా అందంగా వుంటుందని మా పిన్ని చాలాసార్లు చెప్పింది. మేం ఇంకా ఇలా అనుకున్నామో లేదో, 'రోగీ పాలే కోరాడు, వైద్యుడూ పాలే చెప్పాడు' అన్నట్లు మా పిన్ని దగ్గర్నించి వుత్తరం వచ్చింది. వాళ్ళు వైశాఖమాసంలో అన్నపూర్ణ పెళ్ళి చేద్దామనుకుంటున్నారు. కాబట్టి సాధ్యమయినంత ముందుగా మమ్మల్ని పంపమని ఆ వుత్తరం సారాంశం. ఆ రోజుల్లో రెక్కలు కట్టుకు ఎగరడం అన్నిచోట్లకీ కుదిరేది కాదు కదా. అందుకని కాళ్ళకి చక్రాలు కట్టుకుని వాళ్ళ ఇంట్లో వాలిపోయాం.

అన్నపూర్ణ అంటే మా పిన్ని పెద్దకూతురు. నాకన్నా అయిదారు నెలలు పెద్దది. దాని పూర్తి పేరు అన్నపూర్ణా విశాలాక్షి. అమలాపురంలో వాళ్ళ పెద్దత్త సుబ్బలక్ష్మి గారి ఇంట్లో వుండి బి.ఎస్సీ. చదువుకునేది. సుబ్బులమ్మ గారికి ఒక్కడే కొడుకు. పేరు విశ్వనాథం. అన్నపూర్ణ చదివే కాలేజిలోనే బి.కాం. ఫైనల్ ఇయర్ చదువుతుండేవాడు. మనిషి చాలా బావుండేవాడు. చాలా బాగా పాటలు పాడేవాడు. సుబ్బులమ్మగారికి కూడా ఏ సంగీతమయినా ఇష్టమే. తల్లీకొడుకులిద్దరూ కలిసి బోలెడు పాటలు పాడుకుంటూ వుండేవారు. ఆవిడకి అన్నపూర్ణంటే తగని గారాబం కాబోయే కోడలని చెప్పి. అది ఫస్టియరు చదువుతున్నపుడే మా బాబాయి అమలాపురం వెళ్ళి బావగారి చేతిలో తాంబూలం పెట్టి సంబంధం ఖాయం చేసుకున్నాడు. అది అసలే అమలాపురం. పైగా అందులో కూచిమంచి వారి అగ్రహారం. తాంబూలాలు కూడా మార్చుకున్నారు కాబట్టి ఆ పేట వాళ్ళందరూ అన్నపూర్ణని సుబ్బులమ్మగారి కోడలనే పిలిచేవారు. "ఇలా పిల్లా పిల్లాడూ ఒకే ఇంట్లో వుండి ఒకే కాలేజిలో చదువుకుంటు వుంటే వూరంతా కంటకంగా వుంది. కాబట్టి వెంటనే ముహూర్తాలు పెట్టి పెళ్ళి చేయండి" అని ఆవిడ తన తమ్ముడికీ, తండ్రికీ తాఖీదులు పంపుతూ వుండేది. కనీసం డిగ్రీ అయేవరకన్నా ఆగితే బాగుణ్ణని మా బాబాయ్‌కి వుండేదిగాని

వాళ్ళ అక్కా, నాన్నల ముందు తన మాట నెగ్గేది కాదు.

మా అన్నపూర్ణ అత్తగారు చాలా అందంగా వుండేది. మంచి ఇంగ్లీషు మాట్లాడేది. స్వంతంగా కారు డ్రైవ్ చేసేది. క్లబ్‌లో బాడ్‌మింటన్, టెన్నిస్ లాంటి ఆటలు ఆడేది. మిగతా జిల్లాల కన్నా గోదావరి జిల్లాలో మహిళలు ఆ రోజుల్లోనే బాగా చదువుకునేవారు. వారి మీద శరత్‌బాబు, రవీంద్రనాథ్ టాగోర్ లాంటి వంగ కవుల ప్రభావం వుండేది. మధ్యతరగతి కుటుంబాలలో కూడా వంటకి మనుషులని పెట్టుకునేవారు. మా బామ్మగారు, తాతగారు వాళ్ళిద్దరూ కూచుని ఎవరిగురించేనా మాట్లాడుకుంటూ "ఆ! వాడెందుకూ పనికిరాడు! ఇంట్లో పెళ్ళాం చేత వంట చేయిస్తాడు" అని అనుకునేవారు. అంటే ఆడవాళ్ళు వంట చేయడం పరువుతక్కువ అనుకునే కుటుంబాలు కూడా వుండేవన్నమాట!

మేము సంగం చేరిన రెండు రోజులకే సుబ్బులత్తయ్య కుటుంబం, చిన్నత్తయ్య కుటుంబం వచ్చారు. పెళ్ళి ముహూర్తం కూడా ఆవిడ ఎవరో పెద్ద సిద్ధాంతిగారితో అమలాపురంలోనే పెట్టించుకొచ్చింది. మే 15 తెల్లవారుజాము 3.30కి పెళ్ళి ముహూర్తం. ఇంతకీ పెళ్ళికొడుక్కి అప్పటి వరకూ ఉపనయనం కాలేదు. కాబట్టి ఆ సిద్ధాంతిగారే మే 1న వడుగు ముహూర్తం పెట్టారు. వడుగు తిరపతిలో చేస్తామని ఎప్పుడో ఆవిడ మొక్కుకుందిట.ఇంక వడుగు, పెళ్ళీ రెండూ కలిసొచ్చేలా ముహూర్తాలు పెట్టించుకుని తిరుపతి సంగం దగ్గిరే కదా అని తన అత్తవారి బంధువర్గంతో సహా ఒక వారం ముందే ఆవిడ తమ్ముడింటికి వచ్చారన్నమాట.ఆ నాలుగురోజులూ వడుక్కి కావలసిన బ్రాహ్మల్ని మాట్లాడుకోడం,వాళ్ళు చెప్పిన వస్తువులు కొనుక్కోవడం, ఒక చిన్న బస్సు మాట్లాడుకోవడం లాంటి హడావిడితో గడిచిపోయింది. తిరుపతిలో ఫంక్షనంటే రామని ఎవరంటారు? నోరు జారామంటే మేమూ వస్తామంటారు. మళ్ళీ అందర్నీ తీసుకెళ్ళాలి, తీసుకురావాలి. పాపం అంతా బాబాయే చూసుకున్నాడు. అనుకోకుండా తిరపతి ప్రయాణం తగలడంతో మా సంతోషానికి అడ్డుకట్టలేదు. మా అన్నపూర్ణని ఇంట్లోనే వదిలేసి వెళ్ళాం. అది చూడకూడదుట కదా. పిల్లలమంతా సరదాగా కొండ నడిచి ఎక్కాం. ఒక రెండు కాటేజిలు తీసుకుని అక్కడ ఫంక్షను చేసుకుని స్వామిని చూసి మర్నాటికి సంగం చేరాం.

ఇంక నెమ్మదిగా ఒక్కొక్కళ్ళే చుట్టాలు రావడం మొదలుపెట్టారు. ఆ రోజుల్లో ఎవరన్నా ఆడపిల్ల పెళ్ళికి ఒకట్రెండు రోజుల ముందు వస్తే తప్పట్టుకునేవారు. "ముహూర్తం ఇంకా  రెండు రోజులుందిగా అప్పుడే వచ్చేశారే! అబ్బో మా మీద

ఎంత దయో!" అని దెప్పేవారు. చేతిలో పనందుకుని కన్యాదాతకి సాయంగా నిలబడాలంటే కనీసం నాలుగురోజులు ముందు రావాలన్నది అప్పటి నియమం. మళ్ళీ అప్పగింతలయి పిల్లని సాగనంపేవరకు ఎవరూ వెడతామనకూడదు. ఏమిటో! పెళ్ళంటే కనీసం పదిరోజులందరూ పందిరి కింద వుండాలి. పెళ్ళివారికి మర్యాదలు చేయాలి. దేనికోదానికి పోట్లాడుకోవాలి. ఆడపిల్ల అలిగి కళ్ళనీళ్ళెట్టుకోవాలి. మళ్ళీ అందరూ చుట్టూ చేరి బతిమాలి చివరికి ఏమీ జరగనట్లు కబుర్లు చెప్పుకోవాలి. పెళ్ళంటే అదీ! నెమ్మదిగా బంధువులంతా చేరడంతో ఇల్లిరుకుగా అనిపించి మా బాబాయ్ ఎదురుగా ఇంకో బంగళా బాగు చేయించి తన బంధువులనందులో వుండమన్నాడు. దాంతో అది ఆటోమేటిగ్గా మగపెళ్ళివారి విడిదయిపోయింది. నేనూ చిన్నారీ చచ్చినట్లు కాఫీ బిందెలూ, గ్లాసూలూ మోయాల్సివచ్చేది. అలా రెండుసార్లు కాఫీలు పట్టుకెళ్ళాక చిన్నారికి విసుగొచ్చి "ఇదుగో! మీరింకా మగపెళ్ళివారేం కాలేదు! పెళ్ళి ఇంకా వారంరోజులుంది. ఎవరి కాఫీలు వాళ్ళు మా ఇంటికొచ్చి తాగండి" అని చెప్పి చక్కా వచ్చింది. అప్పటినుంచీ దానికి ఎవ్వరూ ఏ పనీ చెప్పేవారు కాదు.

పెళ్ళికి కావల్సిన చీరలు, నగలు కొనడానికి రోజూ జీపులో నెల్లూరు వెళ్ళేవారం. నెల్లూరులో బంగారం పనివారు చాలా అందమైన నగలు చేస్తారు. అత్తయ్య తన కాబోయే కోడలికి చాలా చక్కటి నగలు చేయించింది. మేమందరం ఒక బట్టలకొట్లో వున్నపుడు బాబాయ్ వాళ్ళ కాంట్రాక్టరుగారొకాయన పలకరించారు "ఏం సార్! అమ్మాయి పెళ్ళా?" అని. "అవునండి. ఇంక వారం రోజుల్లోకి వచ్చింది" అని బాబాయ్ సమాధానం చెప్పాడు. "మా మల్లెతోట మంచి పూతమీదున్నాదండి. పూలెక్కడా కొనమోకండి. నేను పంపిస్తాన"ని చెప్పి మాట తప్పకుండా రోజూ మధ్యాహ్నం రెండు కొట్టేటప్పటికి పెద్ద బుట్టెడుపూలు పంపేవాడు. ఇంక చూసుకోండి మూడేళ్ళ పిల్ల దగ్గిర్నించీ మూడు పాతికల ముత్తైదువుల వరకూ ఒకరిరొకరు పూలజడలేసుకోడమే. చూసేవాళ్ళకి పిచ్చెక్కిపోయేది – ఇంక మళ్ళీ బాబాయే కబురు పెట్టాడు "పెళ్ళి పదిహేనో తారీకున. ఆ రోజు రెండు శేర్లు పూలు పంపండి. ఇప్పుడింక అక్కర్లేదూ" అని!

మా మామయ్య, అక్క, అమ్మమ్మ, తాతగారు పెళ్ళి మూడురోజులుండనగా వచ్చారు. నేనా పెళ్ళిలో ఒక విషయం కనిపెట్టాను. మనం ఏదైనా పెళ్ళికి వెళ్ళామనుకోండి! ఆ పూట మనకి అందరూ చాలా మర్యాదలు చేస్తారు. అంటే జాయినింగ్ రిపోర్టు ఇచ్చినట్లన్నమాట. ఇహ ఆ తరువాత మనం గొడ్డు చాకిరీ చేయాల్సిందే! అలా రోజూ ఏవీ మర్యాదలు చేస్తూ వుండరు. పెళ్ళికి

వచ్చినవాళ్ళందరూ సంతోషంగానే వున్నారు కానీ మా తాతగారు ఏం అలా లేరు. ఎవరు కనిపిస్తే వాళ్ళని కసరడం. పైగా బాబాయ్ వాళ్ళ నాన్నగారితో ఏదో వాదిస్తూ వుండేవారు. వాళ్ళిద్దరూ తలుపులేసుకుని గట్టిగట్టిగా అరుచుకునేవారు. ఎంత ప్రయత్నించినా ఆయనెందుకు అంత గొడవ చేస్తున్నారో తెలుసుకోలేకపోయాం. మాకేమీ అర్థం కాలేదు. చివరకి మా తాతగారు బాబాయ్‌ని పిలిచి "నాయనా! ఈ ముహూర్తంలో చాలా దోషాలు కనిపిస్తున్నాయి. మృత్యుపంచకం కనిపిస్తోంది. చాలా అనర్థాలు జరుగుతాయి. ఈ ముహూర్తంలో పెళ్ళి జరగడానికి నేనుససేమిరా ఒప్పుకోను" అన్నారు. ఇంతలోకే రయ్‌రయ్‌మంటూ బాబాయ్ వాళ్ళ నాన్నగారొచ్చి "బావా! ఏవిటీ నువ్వు మాట్లాడేదీ? ఈ ముహూర్తం పెట్టిందెవరో తెలుసా? దేశంలోనే పేరుమోసిన లక్ష్మణ సిద్ధాంతిగారు. ఆయనకన్నా నీకెక్కువ తెలుసా? నీకింత అభ్యంతరం వుంటే ఇన్నాళ్ళేం చేశావ్. ఇంక పెళ్ళి మూడురోజుల్లో పెట్టుకుని ఏవిటీ వీరంగాలు?'' అని ఎదురు సిద్ధాంతం మొదలుపెట్టారు. వాళ్ళిద్దరూ కొట్టేసుకుంటారేమోనన్నట్లుగా పోట్లాడుకున్నారు. పిల్లలు కొట్టుకుంటే పెద్దవాళ్ళు విడదీయచ్చు. పెద్దవాళ్ళు కొట్టుకుంటే ఎవరేం చేయగలం? అందరం బిక్కమొహాలేసుకుని కూచున్నాం. ఇపుడీ పెళ్ళి ఇంకో పది రోజులు వాయిదా పడిందనుకో. పాపం బాబాయ్, పిన్ని ఏం కావాలి? ఇంతలోకీ మా అమ్మమ్మ ఎక్కడ్నించో వచ్చి మా తాతగారి చెయ్యి గట్టిగా పట్టుకుని అవతలకి తీసుకెళ్ళింది. అప్పటి మటుక్కు ఆ గోల సద్దుమణిగింది.

మర్నాడు పొద్దున్న మా మావయ్య పిన్నిని పిలిచి తన చేతిలో ఐదువందలు పెట్టాడు "అక్కా మీ కట్నాల కోసం ఏదో నా శక్తి కొద్దీ తెచ్చాను. నువ్వు డబ్బే ఇమ్మన్నావు కాబట్టి బట్టలు కొని తేలేదు. మీకు నచ్చినవి కొనుక్కోండి" అన్నాడు. "సరే! సరే! నువ్విచ్చానని ఎవరితో అనకు. మా అత్తారిలో ఘనంగా వుండాలి. మిగతాది నేను చూసుకుంటాలే" అని బజారు వెళ్ళి పైన ఇంకో ఐదువందలు వేసి ఘనంగా కనిపించే ఏర్పాటు చేసుకుంది. ఆ రోజుల్లో ఆడవాళ్ళు ఇప్పటి వాళ్ళ కన్నా తెలివైనవాళ్ళు, బతకనేర్చిన వాళ్ళని నా వుద్దేశం. పైకేమీ అనేవారు కాదు గానీ అన్నీ వాళ్ళకి నచ్చినవిధంగానే జరిగేవి.

పెళ్ళి ముహూర్తం కోసం నిన్న అంత పోట్లాడుకున్నామన్న సంగతే జ్ఞాపకం లేనట్టుగా శుభ్భరంగా టిఫిన్లు తిని మా తాతగార్లిద్దరూ హాయిగా పేకలాడుకోడం మొదలుపెట్టారు. వచ్చిన చుట్టాలు కూడా ఎప్పుడెప్పుడు పెళ్ళయిపోతుందా, ఇళ్ళకి వెళ్ళిపోదామా అన్నట్లు ఆలోచనలో పడ్డారు. మాలాంటి పనిలేనివాళ్ళం పేకాడుతున్న

వాళ్ళ వెనకాల నిలబడి ముక్కలు చూస్తున్నాం. ఇంతలోకీ ఖంగారుపడుతూ మా అమ్మ వచ్చి "నాన్నగారూ! గాయిత్రి ఏడుస్తోంది. ఎవరం వూరుకోబెట్టలేకపోతున్నాం! కాస్త మీరు వచ్చి ధైర్యం చెప్పండి" అంది. "ఏం ఎందుకు? ఎవరేమన్నారు దాన్ని! పాపం పిచ్చిపిల్ల. వంచిన నడుం ఎత్తకుండా చాకిరీ చేస్తోంది. అతగాడేవన్నా అన్నాడా?" అంటూ పెరట్లోకి పరిగెత్తారు. మా పిన్ని పెరట్లో ఓ మూల కూచుని ఏడుస్తోంది. మా అమ్మమ్మ "ఏమిటి గాయిత్రీ! ఇంత శుభకార్యం ముందు పెట్టుకుని నువ్వు కళ్ళనీళ్ళెట్టుకోవచ్చా? ఇప్పుడేమయిందనీ! నీ స్నానమయ్యాక వడ్లు దంపించి ఇంకో ముహూర్తానికి చెయ్యచ్చు. నీ కూతురి కన్నెధార నువ్వు కాకుండా ఇంకోళ్ళు పొయ్యడమా! చూడు నాన్నగారొచ్చారు" అని వూరుకోబెడుతోంది. విషయం అర్థమయిపోయి మా తాతగారు వియ్యంకుడి దగ్గిరకెళ్ళిపోయారు. ఇంకేవుంది! కొన్ని ప్రపంచయుద్ధాలయాక నానాజాతి సమితీ సమావేశమయి పెళ్ళి 15న జరగడానికి ప్రకృతి సహకరించలేదు కాబట్టి 17వ తేదీ ఉదయం 3 గంటలకి ముహూర్తాన్ని మళ్ళీ నిశ్చయించారు. ఇంకా రెండు రోజులాగాలా అని నాలాటి వాళ్ళు కాస్త ఆవలించబోయినా ఒక మొట్టు మొట్టి వూరుకోబెట్టారు.

మేమంతా ముహూర్తం హడావిడిలో పడి కొన్ని విషయాలు మర్చిపోయాం. మామూలుగా అయితే 16 సాయంత్రం రిసెప్షను, కచేరి శ్రీ నేదునూరి కృష్ణమ్మూర్తిగారు చేయాలి. ఆయనకి మేమేం తెలియబర్చలేదు కాబట్టి 16 పొద్దున్నకల్లా మద్రాసునుంచి కారులో పక్కవాయిద్యాలతో సహా వచ్చేశారు. ఇంకా పెళ్ళికాకపోతేనేం పెళ్ళివారమంతా ఖాళీగానే వున్నాం గదా అని కచేరీ ప్రోగ్రాం అలాగే జరిపిద్దాం అనుకున్నాం. పెళ్ళికూతుర్ని కూడా తీసుకెళ్ళాలి అని దానికి మంచి పట్టుచీర కట్టి పువ్వుల జడ వేసి ముస్తాబు చేసాం. మేమందరం పందిట్లోకి నడవబోతుంటే ఒక పెద్దావిడ అడ్డం పడిపోయింది. "ఇంకా నయం! పెళ్ళికూతుర్ని చేసాక సుముహూర్తం వరకూ వాళ్ళిద్దరూ ఒకళ్ళనొకళ్ళు చూసుకోకూడదు. పనిలేక తెరసెల్లా అడ్డం పట్టుకుంటారనుకుంటున్నారా? అన్నీ పిల్ల చేష్టలు" అంటూ మమ్మల్ని కేకలేసి లోపలికి పంపేసింది. ఏడ్చుకుంటూ ఆడపిల్లలమంతా లోపలికి పోయాం. పెళ్ళికూతురక్కడ లేకుండానే రిసెప్షనూ, కచేరి వీనులవిందుగా జరిగిపోయాయి. చూస్తుండగానే రోజులెంత మారిపోయాయి? ఇప్పుడు పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ దండలు మార్చుకోవడాలూ, పెద్దలు అక్షతలు జల్లడాలూ, బహుమతులందించడాలూ, విందు లారగించడాలూ అన్నీ వాళ్ళింకా దంపతులు కాకముందేగా! వేలమంది భోజనాలు చేస్తారు గానీ ముహూర్తం టైముకి ఆశీర్వదించేందుకు పట్టుమని ఏభైమంది కూడా వుండరు.

సరే కొత్త ముహూర్తానికే పెళ్ళయింది. "మధూదయంలో మంచి ముహూర్తం. మాధవీలతకు పెళ్ళి" అని వాళ్ళ అత్తగారు పాటపాడింది. ఎక్కడి చుట్టాలక్కడ సర్దుకున్నారు. అమ్మయ్య అంతా సవ్యంగా జరిగిందని సంతోషంగా అందరం పందిట్లో కూచుని కబుర్లు చెప్పుకుంటున్నాం. పెళ్ళి నాలుగురోజులూ ఇటు సొమ్మటు పోకుండా కావలా కాసిన మా పిన్ని బాబాయ్ వాళ్ళ పెంపుడు కుక్క రాజా బాబాయ్ కాళ్ళ దగ్గర పడుకుని కళ్ళు మూస్తూ తెరుస్తూ విశ్రాంతి తీసుకుంటోంది. ఇలా పెళ్ళి జరిగిందని తెలిసి ఎవరో భాగవతులలాటి వాళ్ళు ఒక పదిమంది వచ్చారు. వాళ్ళు రాగానే నిద్రపోతున్న రాజా ఒక్కసారి ఎగిరి వాళ్ళమీదకి వెళ్ళింది. భయపడి వాళ్ళు పోతుండగా ఇది వెంటపడింది. కన్నుమూసి తెరిచేంతలో లోడు మీదున్న లారీ ఎదురు వచ్చేటప్పటికి దాని కిందపడి వెంటనే ప్రాణాలు కోల్పోయింది పాపం రాజా. మా పిన్ని బాబాయిలని వూరుకోపెట్టడం ఎవరివల్లా కాలేదు. "జనఘోష అమ్మా! ఇలా పోయింది. ఇంకా ఆ ముహూర్తానికయి వుంటే, అమ్మో తల్చుకుంటేనే భయం వేస్తోంది. చూశావా మరి. దోషమంటే దోషమే" అని మా అమ్మమ్మ పబ్లిగ్గానే బాధపడింది. అన్ని ఆనవాయితీలు తీర్చి పెళ్ళివారి బస్సు 23వ తేదీ బయలుదేరింది. మా అమ్మ వూరుకోవచ్చుగా! అబ్బే అలా వూరుకుంటే ఎలా? "భలేవాడివోయ్ రామం! మొత్తానికి నెల్లాళ్ళ పెళ్ళి చేశావ్" అని మెచ్చుకుంది.

✤